ఉన్నరోడ్డు మూతపడింది

- దారి కబ్జాపై చర్యలేవి..?
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- విచారణకు నోటీసులు జారీచేసినా చర్యలు శూన్యం
- ఇళ్లకు దారిలేక వేరేచోట ఉంటున్న కాలనీవాసులు
- సమస్య పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకోని వైనం


కాలువ పక్కన నిర్మించిన ప్రహరీ


కాలువ పక్కన దారి ఉన్నట్లు చూపుతున్న మ్యాప్

జమ్మికుంట: ఏళ్లుగా సొంత స్థలంలో ఇళ్లు కట్టుకొని జీవనం సాగిస్తున్నారు. వరదకాలువ నిర్మించాలని కొన్నేళ్లుగా డిమాండ్ కొనసాగుతోంది. గత ఉపఎన్నికల సమయంలో వరదకాలువ నిర్మాణం చేసి, ఇళ్ల పక్కన నుంచి రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు. రోజులు గడుస్తున్న క్రమంలో కాలువ పక్కన ఉన్న ఓ యజమాని దారి కబ్జా చేసి ప్రహరీ నిర్మించడంతో దారి పూర్తిస్థాయిలో మూతపడింది. దీంతో కాలనీలోని యాభైకిపైగా కుటుంబాల వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, కొంత మందికి మామూళ్లు ముట్టడంతో సమస్య పరిష్కరించడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇళ్లు ఖాళీచేసి కిరాయి ఇంట్లో

పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో 8, 10 వార్డుల మీదుగా రైల్వే గేటు నుంచి వచ్చే వరద ఇళ్లకు నడిచే దారి పక్కన నుంచి పోయేది. ఈ క్రమంలో చాలా ఏళ్లుగా వరదకాలువ నిర్మాణం చేయాలనే డిమాండ్ కొనసాగుతోంది. 2015లో మాజీ మంత్రి, ప్రస్తుత బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వరదకాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొన్ని పరిస్థితుల నేపథ్యంలో హుజూ రాబాద్ ఉపఎన్నికలు వచ్చాయి. ఎన్నికల సమయంలో నాయకులు వరదకాలువ అసంపూర్తిగా నిర్మించారు. కాలువ పక్కన ఉన్న దారి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణ మ్యాప్‌లో దారి ఉన్నట్లు ఆధారాలున్నాయని రెండేళ్లుగా సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు. ఉన్నతాధికారులకు సమస్య పరిష్కరించాలని నోటీసులు అందించినా పరిష్కరించే నాథుడే కరువయ్యారు. సొంతంగా ఇల్లు కట్టుకొని నివాసముండే వారు ఇళ్లు ఖాళీచేసి కిరాయి ఇంట్లో ఉంటున్నారు. ఆర్థికస్థోమత లేనివారు అక్కడే జీవనం సాగుస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దారి సమస్య వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

కాలనీవాసులు ఆవేదన

రెండేళ్లుగా అంబేద్కర్ కాలనీవాసులు అధికారులు, ప్రజాప్రతినిధులను దారి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్, స్థానిక తహసీల్దార్, ఆర్‌డీఎంఏ వరంగల్, కలెక్టర్‌కు ప్రజావాణి ద్వారా ఫిర్యాదులు చేశారు. కానీ దారి సమస్య పరిష్కరించడం లేదు. ఈ క్రమంలో గతనెల జూన్ 15న నోటీసులు జారీచేశారు. కానీ 20 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అద్దె ఇంట్లో ఉంటున్నాం



మా సొంత స్థలంలో ఇల్లు కట్టుకున్నాం. ఇంటి వద్దకు వెళ్లేందుకు దారి లేకుండా చేశారు. సంవత్సరం కాలంగా హనుమడ్లపల్లిలో కిరాయి ఉంటున్నా. ప్రైవేటు స్కూల్ టీచర్‌గా పని చేస్తుంటా. కిరాయి కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దారి ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– అప్పాల రాజేందర్, అంబేద్కర్ కాలనీ, జమ్మికుంట

సీఎంవోకు ఫిర్యాదు చేస్తాం



ఎన్నికల సమయంలో కాలువ నిర్మాణం చేసి పక్కన దారి వేస్తామని హామీ ఇచ్చారు. ఖాళీస్థలం యజమాని దారి కబ్జా చేసి, ప్రహరీ నిర్మిస్తున్నాడని అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేశాం. చర్యలు తీసుకుంటామని 20 రోజుల క్రితం నోటీసులు ఇచ్చారు. సమస్య పరిష్కారానికి సీఎంవో కార్యాలయంలో ఫిర్యాదు చేస్తాం.

– ఎగ్గని శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు, 8వ వార్డు జమ్మికుంట

సమస్య పరిష్కరిస్తాం



మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు అంబేద్కర్ కాలనీ సమస్యపై స్థలపరిశీలన, వరద కాలువ విస్తరణ, పూర్తిస్థాయిలో సర్వేచేసి హద్దులు నిర్ణయించాలని 15 రోజుల క్రితం తహసీల్దార్‌కు లేఖ రాశాం. నివేదిక అందించాక సమస్య పరిష్కరిస్తాం.

– శ్రీధర్, టీపీవో, జమ్మికుంట మున్సిపాలిటీ

క్లుప్తంగా

పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి


విద్యార్థులతో డీఈవో జనార్దన్‌రావు

శంకరపట్నం: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఈవో జనార్దన్ రావు అన్నారు. మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. టీచర్ల బయోమెట్రిక్, విద్యార్థుల ప్రగతి, హాజరుపట్టికలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఉమాదేవి, సెక్టోరియల్ అధికారి అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న లయన్స్ సభ్యులు

గన్నేరువరం: లయన్స్ క్లబ్ సభ్యులు తేల్ల రవీందర్, జీల ఎల్లయ్య జన్మదినం పురస్కరించుకుని ఇటీవల బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశానికి అర్హత సాధించిన విద్యార్థులు వేముల సుస్మిత, వేముల సుప్రియ, వంగ రమను గురువారం క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సన్మానించారు. అనంతరం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అలాగే చాకలివానిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎలక్ట్రికల్ వైరు సమకూర్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, జోన్ చైర్మన్ సునీల్, ఇన్‌చార్జి హెచ్‌ఎం శరత్‌కుమార్, జిల్లా లియో కోఆర్డినేటర్ బూర శ్రీనివాస్, కార్యదర్శి బూర రామకృష్ణ, కోశాధికారి మీసాల ప్రభాకర్, తేల్ల భాస్కర్, కాంతాల అంజిరెడ్డి పాల్గొన్నారు.

రాగిజావ పంపిణీ


రాగిజావ పంపిణీ చేస్తున్న రావుల రమేశ్

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ పాఠశాల విద్యార్థులకు శ్రీసత్యసాయి సేవా సమితి రాగిజావ అందించగా గురువారం సర్పంచ్ రావుల రమేష్ పంపిణీ చేశారు. అంతకుముందు రాగిజావ ప్రయోజనాలను సర్పంచ్ వివరించి సత్యసాయి సేవా సమితిని అభినందించి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు వంగల శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన


భూములు పరిశీలిస్తున్న ఆర్డీవో హరిసింగ్

సైదాపూర్: ప్రభుత్వం జీవో 58, 59 ప్రకారం ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకొని, ఇళ్ల స్థలాలు ఆక్రమించుకున్న భూముల క్రమబద్ధీకరణకు స్వీకరించిన దరఖాస్తుదారుల భూములను గురువారం హుజూరాబాద్ ఆర్డీవో హరిసింగ్ టీం పరిశీలించింది. మండలంలో 12 దరఖాస్తులు రాగా టీం సభ్యులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బావ్‌సింగ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ జయంత్

చిగురుమామిడి: పద్దెనిమిదేళ్లు నిండినవారు కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని చిగురుమామిడి తహసీల్దార్ జింక జయంత్ కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కొత్త ఓటుహక్కు, చనిపోయిన వారిపేర్ల తొలగింపు, తప్పుల సవరణ చేసుకునేందుకు అవకాశం ఉన్నందున గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. 17గ్రామాల్లో 40 బూత్‌లకు 32 మంది అంగన్‌వాడీ టీచర్లు, 8 మంది వీఆర్ఏలు బీఎల్‌వోలుగా పనిచేస్తున్నారని చెప్పారు. సమావేశంలో ఆర్ఐ శైలజ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

వీణవంక: మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని, మైనర్లు వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అలా ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హుజూరాబాద్ ఏసీపీ వెంకట్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సును ఎస్సై శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. యువత మద్యం, మత్తుకు బానిసై జీవితాలను పాడు చేసుకోవద్దని, సన్మార్గంలో నడిచి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని దిశా నిర్దేశం చేశారు. అనతరం యువకులకు క్రికెట్, వాలీబాల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల నుంచి యువకులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ చల్లూరు గ్రామ కమిటీ

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామ నాయీబ్రాహ్మణ సంఘం నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నారాయణదాసు మహేందర్, ప్రధాన కార్యదర్శిగా సంపత్, గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ముత్యాల రవీందర్, కోశాధికారిగా కొత్తగట్టు కుమార్ ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు నారాయణదాసు కార్తిక్, రాజయ్య, గోపీనాథ్, శ్రీనివాస్, శంకర్ తదితరులు ఉన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందజేత

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలుడు గూళ్ల భానువిజయ్ కుక్కల దాడిలో గాయపడ్డాడు. గురువారం వైద్య ఖర్చుల కోసం సముద్రాల సంపత్ రూ.రెండువేల ఆర్థిక సాయం చేశారు. బాలుడికి మెరుగైన వైద్యం కోసం దాతలు ముందుకు రావాలని కోరారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక


చొప్పదండి: విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు


సుందరగిరిలో విద్యార్థులకు క్రీడా పోటీలు


విద్యార్థులను అభినందిస్తున్న జగన్‌మోహన్‌గౌడ్

చొప్పదండి: తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి మండల స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీలలో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నాలుగో తరగతి విభాగంలో గుమ్లాపూర్ పాఠశాలకు చెందిన జి. మాళవిక, ఆర్ లాస్య, కె.సమన్విత, ఏ అనన్య, లిటిల్ ఐలాండ్ పాఠశాలకు చెందిన వి.చక్రిత్, భూపాలపట్నం పాఠశాలకు చెందిన బి.బాలాజీ ఎంపికయ్యారు. ఐదో తరగతి విభాగంలో చొప్పదండి బాలుర పాఠశాలకు చెందిన బి. చరణ్, బి.రోహిత్, భూపాలపట్నంకు చెందిన డి.వరుణ్, గుమ్లాపూర్‌కు చెందిన పి. హర్షిక్, ఏ అశ్విత్, రామలింగయ్యపల్లికి చెందిన టీ.జాహ్నవి, ఏ అక్షిత ఎంపికయ్యారు. నాలుగో తరగతి విద్యార్థులకు 10న, ఐదో తరగతి విద్యార్థులకు 11న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో జిల్లాస్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. ఎంఈవో వేణుకుమార్, జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి జెడ్పీ పాఠశాలలో క్రీడా పాఠశాలలో ప్రవేశానికి మండలస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో 4వ తరగతికి 11 మంది, 5వ తరగతికి 16 మంది విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేశామని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రామడుగు: మండల కేంద్రంలోని విన్నర్స్ పాఠశాల విద్యార్థులు వేముల మాన్విత, బత్తిని సిద్ధార్థ, అనుపురం అక్షిత్, బుత్కూరి మనువర్షన్, పంజాల నవ్యశ్రీలు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. గురువారం పాఠశాల కరస్పాండెంట్ పంజాల జగన్‌మోహన్‌గౌడ్ విద్యార్థులను అభినందించారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గజ్జెల నరసయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుబీమా పథకంతో ఆర్థిక భరోసా

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


దీక్షను విరమింపజేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: ఏ కారణంతోననైనా రైతులు మృతి చెందితే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబీమా పథకం రైతు కుటుంబానికి ఆర్థిక భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని వెంకంపల్లికి చెందిన గుంటుకు రవీందర్ ఇటీవల మృతిచెందగా పథకం కింద మంజూరైన రూ.ఐదులక్షల బీమా ప్రొసీడింగ్ కాపీని గురువారం ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతు కటుంబాలకు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం పథకానికి సంబంధించి ప్రీమియం చెల్లిస్తుందని, రైతు మరణిస్తే పదిరోజుల్లో బీమా సొమ్ము బాధిత కుటుంబానికి అందుతుందన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని, రైతుబంధు, కల్లాల నిర్మాణానికి నిధులు మంజూరు, పండించిన ధాన్యం మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

నిరాహార దీక్ష విరమించిన గర్షకుర్తి గ్రామస్తులు

మండలంలోని గర్షకుర్తి గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో 68 రోజులుగా చేసిన నిరాహార దీక్షను గురువారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలం ఏర్పాటు విషయం మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లామని, సానుకూలంగా స్పందించారని సీఎంతో చర్చించి త్వరలోనే మండలం ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

పనులు ప్రారంభించాలి


మక్తలో స్థలం పరిశీలిస్తున్న డీపీవో

శంకరపట్నం: నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని డీపీవో వీరబుచ్చయ్య అన్నారు. మండలంలోని మక్త, గొల్లపల్లి, రాజాపూర్, కల్వల గ్రామాల్లో పంచాయతీ భవనాలకు కేటాయించిన స్థలాలను గురువారం డీపీవో పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల తో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలన పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బషీరొద్దీన్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఏఈ తిరుపతి, సర్పంచ్ భద్రయ్య, సుష్మ, కార్యదర్శులు ఉన్నారు.

కులవివక్ష అమానుషం

జమ్మికుంట: మంగలి షాపుల్లో దళితులకు కటింగ్, షేవింగ్ చేయమని తీర్మానించి కులవివక్ష చూపడాన్ని ఖండిస్తున్నామని దళితరత్న అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్ అన్నారు. గురువారం జమ్మికుంటలో మాట్లాడారు. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో దళితులకు షాపుల్లో కాకుండా దళితవాడల్లో కటింగ్ చేస్తామనడం అమానుషమని, అన్ని కులవృత్తులవారు కలిసిమెలిసి ఉంటున్న తరుణంలో ఇలాంటి చర్యలకు పాల్పడడం ,బాధాకరమని, అధికారులు వెంటనే స్పందించి, సమగ్ర విచారణ చేపట్టి కారకులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

నార్మల్ డెలివరీల సంఖ్య పెంచాలి

మానకొండూర్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుఖ ప్రసవాల సంఖ్య పెంచాలని ఎంసీహెచ్ పీవో డాక్టర్ వినత వైద్య సిబ్బందికి సూచించారు. మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తుండాలని వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటూ సూచనలు అందించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహం, ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య మరింత పెరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీడీఎం స్వాతి, వైద్యాధికారి కిరణ్‌కుమార్, సీహెచ్‌వో రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసం పెట్టే దిశగా ఎంపీటీసీల సమావేశం

గంగాధర: మండలంలోని ఎంపీటీసీలు గురువారం ఓ చోట సమావేశం నిర్వహించారు. ఎంపీపీ శ్రీరామ్ మధుకర్ పదవీకాలం నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా 14 మంది ఎంపీటీసీలకు 10 మంది సమావేశమై ఆయనపై అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఎంపీపీ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనక పోవడం, ఎంపీటీసీలకు అందుబాటులో ఉండకపోవడం వంటి తదితర విషయాలు సమావేశంలో చర్చకు వచ్చినట్టు సమాచారం.

అల్ఫోర్స్‌లో బోనాలు



రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో గురువారం ఆషాఢ మాసం బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల బోనాల ఊరేగింపు, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె

సైదాపూర్: పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు చెందిన మల్టీపర్పస్ పంచాయతీ కార్మికులు గురువారం ఎంపీడీవో ఆఫీస్ ఎదుట సమ్మెకు చేశారు. జీతాలు పెంచాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

శంకరపట్నం: డిమాండ్ల సాధన కోసం గ్రామ పంచాయతీ కార్మికులు మండలంలోని కేశవపట్నంలో సమ్మె చేశారు. జీపీ కార్మికులను పర్మినెంట్, జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లింపు, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియామకం చేయాలన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళి

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అంబేడ్కర్ చౌరస్తా వద్ద గురువారం ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని అంబేడ్కర్ యువజన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాలర్పించారు.

మానకొండూర్: మండల కేంద్రంలో జగ్జీవన్‌రామ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుడా చైర్మన్ జీవీ రామక్రిష్ణారావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అలాగే బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు విగ్రహానికి నివాళి అర్పించారు.

ఇల్లందకుంట: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

హుజూరాబాద్: పట్టణంలో సైదాపూర్ క్రాస్ రోడ్ వద్ద జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలకు చేసిన కృషిని స్మరించుకున్నారు.

చొప్పదండి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏవైఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు పెద్దెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. దేశానిక చేసిన సేవలను కొనియాడారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

వీణవంక: మండలంలోని శ్రీరాములపేట గ్రామానికి చెందిన చుక్కల బుచ్చయ్య(62)పై అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్ గొడ్డలితో దాడి చేశాడు. పోలీసుల వివరాలు.. బుచ్చయ్య, శ్రీనివాస్ కుటుంబాల మధ్య కొంతకాలంగా భూతగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుచ్చయ్యపై దాడి చేయగా తలకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబీకులు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై..

జమ్మికుంట: పట్టణంలో ఓ ఆస్పత్రిలో వైద్యులను డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బార్పటి రమేశ్ తెలిపారు. కొండూర్ కాంప్లెక్స్‌లోని సురక్ష మల్టీస్పెషలిటీ ఆస్పత్రిలో ఓ వ్యక్తి చనిపోయిన విషయం తెలిసిందే. మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లిన తర్వాత పట్టణంలోని కొత్తపల్లికి చెందిన షేక్ షాభీర్ అలీ ఆస్పత్రికి వెళ్లి డాక్టర్ తిరుపతి దంపతులను రూ.లక్ష డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. డాక్టర్ తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

జీపీ భవనం నిర్మించాలని వినతి



గంగాధర: ముప్పిడినర్సింహులపల్లి గ్రామంలో నూతన పంచాయతీ భవనం నిర్మించాలని సర్పంచ్ మల్లమ్మ, గ్రామస్తులు గురువారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. గ్రామాన్ని పెండలోనిపల్లితో కలిపి నూతన జీపీగా ఏర్పాటు చేశారు. ఇటీవల పంచాయతీ భవనానికి నిధులు మంజూరు కాగా పెండలోనిపల్లిలో ఇటీవల ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ భూమి పూజ చేశారు. అదే సమయంలో మా గ్రామంలోనే పంచాయతీ భవనం నిర్మించాలని ముప్పిడిపల్లి గ్రామస్తులు కోరినా పెండలోనిపల్లిలోనే పనులు ప్రారంభించారు. పనులు జరిగే చోటికి వెళ్లగా పెండలోనిపల్లి గ్రామస్తులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలిసి ముప్పిడినర్సింహులపల్లి గ్రామం నుంచి దాదాపు మూడు వందల మంది గ్రామస్తులు పోలీస్ స్టేషన్, మండల పరిషత్ కార్యాలయాల్లో వినతిపత్రాలు ఇచ్చారు.

ఎమ్మెల్యేను కలిసిన గుండి గ్రామస్తులు



రామడుగు: మండలంలోని గుండి గ్రామం శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం అభివృద్ధికి టీటీడీ ద్వారా రూ.పదిలక్షలు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మంజూరు చేయించారు. ఈసందర్భంగా గురువారం ఎంపీటీసీ మడ్డి శ్యాంసుందర్‌గౌడ్, ఉపసర్పంచ్ మేడి శ్రీనివాస్, పంచాయతీ పాలకవర్గం సభ్యులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపి శాలువా కప్పి సన్మానించారు.